
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం, 2, ఏప్రిల్, 2024



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,730, మధ్య డెల్టాకు 1,125, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



వాడపల్లి వెంకన్నకు రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత భవన నిర్మాణానికి దుద్దుపూడి శ్రీధర్, పద్మ దంపతులు (రాజమహేంద్రవరం) రూ.లక్ష విరాళంగా సమర్పించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సెహరీ బుధ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.34
కాకినాడ	6.25	4.34
అమలాపురం	6.25	4.34

న్యూస్‌రీల్

గణిత పాఠ్య పుస్తకం ఆవిష్కరణ



స్కూల్ అసిస్టెంట్ గణిత పాఠ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ నాగమణి, డీఈవో కమలకుమారి తదితరులు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు, సంస్కృత అకాడమీ డీఎస్సీ అభ్యర్థుల కోసం రూపొందించిన స్కూల్ అసిస్టెంట్ గణిత పాఠ్య పుస్తకాన్ని విద్యాశాఖ జోన్–2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) నాగమణి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఆవిష్కరించారు. పుస్తక రచయిత, గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తిని ఆర్జేడీ నాగమణి అభినందించారు. పుస్తక రచయిత డాక్టర్ సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిషన్ (డీఎస్సీ) పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకం ఎంతో మార్గదర్శకంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో ఎం.కమలకుమారి, అమలాపురం, రామచంద్రపురం డివిజన్ల ఉప విద్యాశాఖాధికారి బి.హనుమంతరావు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సురేష్, ముమ్మిడివరం ఎండీవో బి.రమణశ్రీ, అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనంలో 143 మంది

శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్



బ్రోచర్లను ప్రదర్శిస్తున్న డాక్టర్ ప్రతాప్, జిల్లా వేదిక ప్రతినిధులు, కవులు

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7న అమలాపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జరగనున్న 132వ ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పలు రాష్ట్రాలకు చెందిన 143 మంది కవులు పాల్గొంటున్నారని ఆ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ వెల్లడించారు. స్థానిక పట్టాభివీధిలోని సాయి సంజీవని ఆస్పత్రి ఆడిటోరియంలో జిల్లా శ్రీశ్రీ కళావేదిక సోమవారం నిర్వహించిన కవి సమ్మేళనం సన్నాహక సమావేశానికి డాక్టర్ ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కవులు సమ్మేళనంలో అధికంగా పాల్గొంటారని చెప్పారు. కవి సమ్మేళనం ఆ రోజు ఉదయం 8.30 గంటలకు మొదలై సాయంత్రం 6 గంటల వరకూ నిర్విరామంగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్లను డాక్టర్ ప్రతాప్‌తోపాటు కవులు ప్రదర్శించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వేదిక జిల్లా అధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గుర్రం రామకృష్ణారావు, మాకే బాలార్జున సత్యనారాయణ పాల్గొన్నారు.

పండుటాకులపై పగ

- రాజకీయ దురుద్దేశంతో అడ్డుకున్న టీడీపీ
- పింఛన్ సొమ్ము కోసం ఎదురుచూస్తున్న అభాగ్యులు
- వలంటీర్ల నిరుపమాన సేవలు



వరద బాధితులకు అందించే అల్పాహారాన్ని ప్యాకింగ్ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

సాక్షి అమలాపురం: ఒకటో తారీఖు. జీతాలు పడే రోజు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పండుటాకులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సైతం ఒకటో తారీఖున పింఛన్ సొమ్ము వచ్చే రోజు. వలంటీర్లు వచ్చి ఒకటో తేదీ తెల్లవారు జామునే ఇంటి తలుపు కొట్టి... గుమ్మం వద్ద పింఛన్ అందిస్తున్నారు. కాని వలంటీర్ల సేవలపై కళ్లు కుట్టిన విపక్షాలు కుట్ర పన్ని తమ జేబు సంస్థ ద్వారా వారిని అడ్డుకున్నాయి. తద్వారా పండుటాకులకు సకాలంలో పింఛన్ అందకుండా చేశారు. దీనితో పింఛన్ మీద ఆధారపడే ఎంతోమంది లబ్ధిదారులు ఆ సొమ్ము కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. పింఛన్ వస్తే మందులు తెప్పించుకునేవారు.. నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేవారు వాటి కోసం పడిగాపులు పడేలా చేశారు. గత టీడీపీ హయాంలో పంచాయతీల వద్ద బారులు తీరే దృశ్యాలను లబ్ధిదారులకు టీడీపీ, జనసేన మిత్రపక్షాలు మళ్లీ చవి చూపిస్తున్నాయి. జిల్లాలో అన్నిరకాల పింఛన్ దారులు సుమారు 2.45 లక్షల మంది వరకు ఉన్నారు.

ప్రతిపక్షాల బురదజల్లుడు

ఒకటో తేదీ తెల తెలవారకుండానే ఇంటి తలుపు కొట్టి... గుమ్మం వద్ద పింఛన్ అందించడం దగ్గర నుంచి రేషన్ ద్వారా నిత్యావసర వస్తువుల సరఫరా వరకు... జగనన్న సురక్ష ద్వారా ఆరోగ్య సమాచారం సేకరించడం వద్ద నుంచి వారికి పరీక్షలు చేయించి వైద్యునికి చూపించడం వరకు... గోదావరి వరదల సమయంలో మెడలోతు నీటిలో బాధితులకు అన్న పానీయాలు అందించడం దగ్గర నుంచి కరోనా వంటి విపత్కర పరిస్థితులలో చావుకు తెగించి బాధితులకు మందులు అందించడం వరకు ఇలా చెప్పుకుంటూ పోతే వలంటీర్లు చేస్తున్న సేవలు నిరుపమానం. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేదల చెంతకు చేరవేయడంలో, ఇందుకు అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్‌లు, ఇంటి పన్ను వసూలు.. ఇలా ఇంటి వద్ద పేదల నుంచి ఎగువ మధ్యతరగతి వారి వరకు సేవలందిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు బురదజల్లుడుకు దిగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీరు వ్యవస్థను తీసుకువచ్చింది. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హుల చెంతకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేసే లక్ష్యంతో సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారు. 2019 ఆగస్టు 15వ తేదీన ప్రారంభమైన వలంటీర్ వ్యవస్థ ప్రజలతో మమేకమైంది. జిల్లాలో సుమారు 9,581 మంది వలంటీర్లు ఉన్నారు. ఈ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి వారిని లక్ష్యంగా చేసుకుని విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఈ వ్యవస్థను పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. వివిధ దేశాల నుంచి వచ్చిన వారు కూడా ప్రత్యేక అధ్యయనం చేస్తున్నారు. అటువంటి వ్యవస్థపై ప్రతిపక్షాలు దిగజారుడు విమర్శలు చేస్తున్నాయి. తాజాగా వలంటీర్ల ద్వారా పింఛన్ అందకుండా చేశారు. పింఛన్ కోసం పంచాయతీలు, సచివాలయాల వద్ద పండుటాకులు, వికలాంగులు, వితంతువులు గంటల పాటు ఎదురుచూసేలా చేశారు.

ఆపదల వేళ..

కరోనా మహమ్మారికి భయపడి అయిన వాళ్లే దగ్గరకు రాని సమయంలో కోవిడ్ బాధితులు కోలుకునేంత వరకు వారికి ప్రభుత్వం ద్వారా వలంటీర్లు అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అనారోగ్యంతో ఇతర రాష్ట్రాల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు సైతం వెళ్లి పింఛన్ అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా 2022 జూలై, ఆగస్టులలో గోదావరికి రికార్డు స్థాయిలో వరదలు వచ్చిన సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివి. పడవల మీద ప్రాణాలకు తెగించి తిరుగుతూ ప్రభుత్వం అందించిన బియ్యం, నిత్యావసర వస్తువులు, ఆహారం, మంచినీరు బాధితులకు అందించి శభాష్ అనిపించుకున్నారు. రేయింబళ్లు గోదావరి ఏటిగట్ల మీద పహారా కాస్తూ గండ్లు పడకుండా అధికారులను అప్రమత్తం చేశారు. వారు అందించిన సమాచారం కారణంగానే రాజోలు మండలం సోంపల్లి వద్ద గండిపడకుండా ఇరిగేషన్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు.

వాగులు దాటి బాధితులకు సేవలు



ఇతని పేరు కాశిన రమేష్, కపిలేశ్వరపురం మండలం కేదారిలంక గ్రామానికి చెందిన వలంటీర్. ఈయన ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నాడు. లంక గ్రామం కావడంతో ఏటా వరదల సమయంలో గ్రామం ముంపుబారిన పడుతుంది. ఆ సమయంలో గోదావరి నీటి ప్రవాహంలో వాగులను దాటుకుంటూనే బాధిత కుటుంబాలకు వాటర్ టిన్నులు అందించడమూ, ప్రభుత్వం సమకూర్చిన ఆహార పదార్థాలను, కూరగాయలను అందించడం చేశాడు. పింఛన్ల పంపిణీలో లక్ష్యాన్ని తొలిరోజునే దాదాపు పూర్తి చేస్తాడు.



తెల్లవారు జామునే పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఒకటో తారీఖునే పింఛన్



ప్రతి నెల ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్లు మా ఇళ్లకు వచ్చేవారు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే పింఛన్ తెచ్చి ఇచ్చేవారు. కానీ ఇప్పుడు వలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయం వద్దకే వెళ్లి పింఛన్ తీసుకోవడం చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. టీడీపీ వాళ్లు చేసిన పని వల్ల అందరూ ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– కొప్పుల ధర్మయ్య, ఆర్యావటం, రామచంద్రపురం నియోజకవర్గం

టీడీపీ వాళ్లకు మా ఉసురు తగులుతుంది



మాకు ఇచ్చే పింఛన్ సొమ్ము మేము బతకడానికి చాలా అవసరం. గతంలో ఈ పింఛన్ కోసం పంచాయతీల వద్ద రోజంతా ఉండాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఎక్కడికీ వెళ్లవలసిన అవసరం లేకుండా ప్రతీ నెలా ఒకటో తేదీన వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చి వెళుతున్నారు. టీడీపీ వాళ్లు మాకు పింఛన్ రాకుండా చేశారు. వాళ్లకు మాలాంటి వాళ్ల ఉసురు తగులుతుంది.

– అంగర వెంకట్రావు, పింఛను లబ్ధిదారుడు అవిడి, కొత్తపేట మండలం

తాగునీటి సమస్యకు చెక్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా వేసవి కార్యాచరణ ప్రణాళికలను సమగ్రంగా రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా గ్రామీణ తాగునీటి సరఫరా, మున్సిపల్ శాఖలను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి 26 జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తాగునీటి సరఫరా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా సరాసరి వేతనాల చెల్లింపు, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ, వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న జూన్ నెలాఖరు వరకూ ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవి స్టోరేజ్ ట్యాంకులను, తాగునీటి రిజర్వాయర్లను కాలువలు మూసివేసేలోగా పూర్తిగా నింపుకోవాలన్నారు. ఉపాధి పథకం ద్వారా పనులు నిర్వహించే చోట టెంట్లు వేయాలన్నారు. ప్రభుత్వం నరేగా అమలుకు సంబంధించి వేసవి అలవెన్సును పెంచిందన్నారు. జేసీ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌ఓ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, సీపీవో వెంకటేశ్వర్లు, డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావు దొర పాల్గొన్నారు

నిండు శోకంతో హజ్రత్ అలీ షహదత్

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ అలీ షహదత్‌ను సోమవారం ముస్లింలు నిండు శోకంతో నిర్వహించారు. నగరంలోని మొల్లా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి ఊరేగించారు. ఫర్హత్ అలీబేగ్ ఆధ్వర్యంలో మర్షియా ఆలపించారు. కూఫా పట్టణంలో హజరత్ అలీపై జరిగిన దాడిని మత ప్రబోధకులు మెహదీ హసన్ బెహిష్తి భక్తులకు వివరించగా కన్నీటి పర్యంతమయ్యారు. దీనిలో భాగంగా గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. షహదత్‌ను పురస్కరించుకుని మామిడికుదురు, నగరం, మొగలికుదురు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు జరిగాయి.

సీఎం జగనన్న పాలనలో బీసీలకు ప్రాధాన్యం

- రాజ్యసభ సభ్యుడు బోస్
- వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు
- 300 మంది కార్యకర్తలతో చేరిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలాశంకర్



లీలాశంకర్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బోస్

కాజులూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు తగిన ప్రాధాన్యమిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. సోమవారం మండలంలోని తణుకువాడలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జి రాయుడు లీలాశంకర్ తన అనుచరులు 300 మందితో కలసి వైఎస్సార్ సీపీలో చేరారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నూతలపాటి శ్రీనివాసరాజు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజు తదితరులు పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ బోస్ మాట్లాడుతూ బీసీలను తెలుగుదేశం పార్టీ ఓటుబ్యాంకు రాజకీయాల కోసం వాడుకుందే తప్ప ఎటువంటి ప్రయోజనాలు చేకూర్చలేదన్నారు. సీఎం జగనన్న బీసీలకు 40శాతం సీట్లు కేటాయించారని దేశ రాజకీయ చరిత్రలో బీసీలకు ఇంతటి ప్రాధాన్యం కల్పించటం ఇదే ప్రప్రథమమన్నారు. అనంతరం రాయుడు లీలాశంకర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సీట్ల ఎంపికలో అభ్యర్థి ఆర్థిక పరిస్థితులే తప్ప సామాజిక సమీకరణలకు ప్రాధాన్యం లేదన్నారు. ఇతర ప్రాంతాల నుంచి డబ్బు మూటలతో రాజకీయం చేయటానికి వచ్చిన వ్యక్తి రాజకీయాన్ని వ్యాపారంగా భావిస్తారే కాని కార్యకర్తలు, ప్రజలను ఎందుకు పట్టించుకుంటారన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేసి రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ విజయానికి, జగనన్నను మరోసారి సీఎంను చేసేందుకు కృతనిశ్చయంతో పని చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు పితాని సుబ్రహ్మణ్యం, సత్తి శ్రీరామారెడ్డి, కురుపూడి సూర్యనారాయణ, రేమళ్ళ చిట్టియ్యదొర, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, వైఎస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, మాజీ సర్పంచ్‌లు డీవీ రమణ వాసంశెట్టి శ్రీనివాస్, పితాని ఆదినారాయణ, కర్రి బస్వీరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల పొట్ట కొడుతున్న టీడీపీ

- కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- ర్యాంపులు తెరవాలని కలెక్టర్‌కు మొర పెట్టుకున్న కార్మికులు



ఇసుక ర్యాంపు కార్మికులతో మాట్లాడుతున్న కొత్తపేట ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

సాక్షి అమలాపురం: 'రాజకీయాల కోసం కార్మికుల పొట్టకొట్టడం టీడీపీ నాయకులకు మాత్రమే చెల్లిందని, ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపించి ఇసుక రీచ్‌లను మూసివేయాలని టీడీపీ నాయకులు కోరడం సమంజసం కాదని కొత్తపేట ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇసుక ర్యాంపులలో పని చేసే కార్మికులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను సోమవారం కలిశారు. మందపల్లి ర్యాంపుపై సుమారు 900 మంది, 500 మంది వరకు లారీ ఓనర్లు, డ్రైవర్లు, ఊబలంక ర్యాంపుపై సుమారు 300 కార్మికులు ఆధారపడి జీవిస్తున్నామని ఆయా రాంపుల తెరిపించి తమకు న్యాయం చేయాలని కార్మికులు కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వేడుకున్నారు. వారం రోజుల నుంచి ర్యాంపులు మూసివేయడం వల్ల కుటుంబాల రోడ్డున పడ్డాయన్నారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి కొత్తపేట నియోజకవర్గంలోని ఇసుక ర్యాంపులలో పనిచేస్తూ కార్మికులు, లారీల డ్రైవర్లు, మెషీన్ ఆపరేటర్లు, కార్మికులు సుమారు 20 వేల మందికి వరకు జీవనం సాగిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల నిబంధనల పేరుతో అధికారులపై ఒత్తిడి చేసి ర్యాంపులు మూసివేయించారన్నారు. తమ జీవనోపాధి కోల్పోయిన కార్మికులు కలెక్టర్‌ను కలిసి మొర పెట్టుకున్నారని తెలిపారు. సీజన్ పూర్తయితే వర్షాలు, వరదలు వచ్చి ర్యాంపులలో ఇసుక తవ్వకాలు నిలిచిపోతాయని జగ్గిరెడ్డి తెలిపారు. నిబంధనలకు లోబడి కార్మికులు పనిచేసుకునే అవకాశం ఇవ్వాలని జగ్గిరెడ్డి కోరారు. కొత్తపేటలో ఏడు ర్యాంపులకు అనుమతులు ఉన్నాయని టీడీపీ నాయకులు బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో వచ్చి ర్యాంపులు మూయించారన్నారు. 'టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఏమిటని ఎగతాళి చేసిన చంద్రబాబు పెత్తందారి పోకడలు అవలంబిస్తున్నారు. పేదల పట్ల ఆయనకు ఉన్న చులకన భావన. తప్పుడు ఆలోచనలు మంచివి కావు. ఇంత వయసు వచ్చిన బాబు బుద్ధి తెచ్చుకుని సామన్యులను ఇబ్బంది పడే పనులు మానుకోవాలి' అని జగ్గిరెడ్డి హితవు పలికారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా సామాన్యుల బతుకులు పాడు చేయాలని ఎన్నికల కమిషన్ చెప్పదన్నారు. రెండు నెలల్లో మరోసారి జగన్ ప్రభుత్వం వస్తోంది. వలంటీర్ల ద్వారా ఇప్పుడందుతున్న సంక్షేమం కొనసాగుతుంది. టీడీపీ నేతల తీరు వల్ల కొత్తపేట నియోజకవర్గంలో పరిధిలో 40 వేల మందికి పైగా ఒకటవ తారీఖున పింఛన్ అందకుండా పోయిందన్నారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గని గంగాధర్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మునునూరి వెంకటేశ్వరరావు, ర్యాంపు కార్మిక సంఘం ప్రతినిధి సాదు చెంచయ్య పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో అమలాపురం ఫస్ట్

- 80.32 శాతం వడ్డీ రాయితీని ఉపయోగించుకున్న పట్టణాలు
- రూ.20.36 కోట్ల లక్ష్యానికి రూ.16.36 కోట్ల వసూలు



అమలాపురం మున్సిపాలిటీ భవనం

అమలాపురం టౌన్: మార్చి 31వ తేదీ లోపు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీతో రాయితీ వర్తిస్తుందన్న ప్రభుత్వ ప్రకటనకు జిల్లాలోని మున్సిపాలిటీలు స్పందించి 80.32 శాతం మేర సద్వినియోగం చేసుకున్నాయి. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతోపాటు ముమ్మిడివరం నగర పంచాయితీల పన్ను రాయితీ గణంకాలు పరిశీలిస్తే అమలాపురం మున్సిపాలిటీయే ముందు వరుసలో ఉంది. అమలాపురం మున్సిపాలిటీలో 85 శాతం మేర పన్నుల చెల్లింపుదారులు స్పందించి సకాలంలో పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందారు. మిగిలిన మున్సిపాలిటీలు 80 శాతం ఆ లోపు మాత్రమే పన్నుల వసూళ్ల ప్రగతిని సాధించాయి. జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్నుల లక్ష్యం మొత్తం రూ.20.36 కోట్లు కాగా పన్ను రాయితీని సద్వినియోగం చేసుకున్నది రూ.16.36 కోట్లు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో మొత్తం 45,808 ఇళ్లు, వ్యాపార దుకాణాలు, పలు సంస్థల భవనాలు (అసెస్‌మెంట్లు) ఉన్నాయి. అమలాపురం మున్సిపాలిటీలో 14,831 అసెస్‌మెంట్లు, రామచంద్రపురంలో 12,056, మండపేటలో 13,199, ముమ్మిడివరం నగర పంచాయితీలో 5,733 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో 80.32 శాతం ఇళ్లు, భవనాల యాజమానులు పన్ను రాయితీ సద్వినియోగానికి ముందుకు వచ్చారు. గత సంవత్సరం ప్రభుత్వం పట్టణాల్లో పన్ను రాయితీ ఇచ్చినప్పుడు 80 –90 శాతం మధ్య పన్నులను సకాలంతో చెల్లించి రాయితీని ఉపయోగించుకున్నారు. ఈ ఏడాది రాయితీ సద్వినియోగం జిల్లాలో 80.32 శాతం మాత్రమే ఉండడంపై ఆయా మున్సిపాలిటీల అధికారులు అధ్యయనం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 20 శాతం మంది పన్ను చెల్లింపుదారులు పట్టణాల్లో పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల పాత సంవత్సరం పన్నుల వడ్డీతోపాటు కొత్త సంవత్సరం పన్నుల వడ్డీ కూడా తోడై వడ్డీలు పెరిగే పరిస్థితి ఉంటుంది. నెల రోజులుగా మూడు మున్సిపాలిటీలు, నగర పంచాయితీల కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఆ విభాగపు సిబ్బంది సకాలంలో పన్నుల చెల్లించి వడ్డీ రాయితీ పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా క్షేత్ర స్థాయికి వెళ్లి మరీ అవగాహన కల్పించారు. చెల్లింపుదారుల వద్దకు కమిషనర్లు, రెవెన్యు అధికారులు స్వయంగా వెళ్లి పన్నులు వసూలు చేశారు.

జిల్లాలో మున్సిపాలిటీల్లో వడ్డీ రాయితీ, పన్నుల వసూళ్ల ప్రగతి ఇలా

మున్సిపాలిటీ	పన్నుల లక్ష్యం	వసూలైన మొత్తం	శాతం
అమలాపురం	రూ.8.11 కోటు	రూ.6.90 కోట్లు	85
రామచంద్రపురం	రూ.4.78 కోట్లు	రూ. 3.78 కోట్లు	79.10
మండపేట	రూ.6.23 కోట్లు	రూ.4.73 కోటు	75.80
ముమ్మిడివరం (నగర పంచాయతీ)	రూ.1.24 కోట్లు	రూ.95 లక్షలు	77
మొత్తం	రూ.20.36 కోట్లు	రూ.16.36 కోట్లు	80.32

గత సంవత్సరమూ ముందంజ

గత సంవత్సరం ప్రభుత్వం పట్టణాలకు ఇచ్చిన పన్ను వడ్డీ రాయితీలోనూ అమలాపురం మున్సిపాలిటీ 94 శాతం మేర ముందంజలో ఉందని ఆ మున్సిపాలిటీ రెవెన్యూ అధికారి (ఆర్వో) శిరిగినీడి శివాజీ తెలిపారు. ఈ ఏడాది కూడా అమలాపురం మున్సిపాలిటీ 85 శాతం వసూలు చేసి ముందంజలో ఉందని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ కమిషనర్ మనోహర్, తమ రెవెన్యూ విభాగ బిల్ కలెక్టర్లు, సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది పన్నుల వసూళ్లపరంగా చేసిన కృషి అభినందనీయమని చెప్పారు. పన్ను చెల్లింపుదారులు కూడా సహకారం అందించారని పేర్కొన్నారు.

తమ్ముళ్ల బాహాబాహీ



అంబాజీపేటలో తలపడుతున్న తెలుగు తమ్ముళ్లు

ఆత్మీయ పరిచయ వేదికలో రసాభాస

అంబాజీపేట: ఉమ్మడి అభ్యర్థి ఆత్మీయ పరిచయ వేదిక సాక్షిగా తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగి ఒకరినొకరు దూషించుకున్నారు. అంబాజీపేట వెంకట్రాజు ఆయిల్ అండ్ ఫ్లోర్ మిల్ ఆవరణలో పి.గన్నవరం నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఆత్మీయ పరిచయ వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఒక పక్క గ్రామాల వారీగా పరిచయాలు జరుగుతుంటే తెలుగు తమ్ముళ్ల వాగ్వాదాలకు దిగారు. పుల్లేటికుర్రు శివారు చినలంకలో టీడీపీ గ్రామ, మండల కమిటీలకు ముందస్తుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సర్పంచ్ జల్లి బాలరాజు తన వర్గీయులతో కలిసి ఆదివారం రాత్రి సమావేశం, విందు ఏర్పాటు చేసి పార్టీ నాయకులను పిలవకుండా అవమానించారని ఉమ్మడి అభ్యర్థి సత్యనారాయణ సమక్షంలోనే ఘర్షణకు దిగారు. పార్టీలో ఉన్నవారికి ఇచ్చే గౌరవం ఇదేనా, జెండా మోసేవాడిని అవమానించడమే నాయకుల లక్షణమా అని నిలదీశారు. దాంతో సర్పంచ్ వర్గీయులకు, గ్రామ శాఖ, మండల స్థాయి నాయకులకు మాటల యుద్ధం చోటుచేసుకుంది. తెలుగు తమ్ముళ్లు ఒకరినొకరు దూషించుకోవడంతో పరిచయ వేదిక గందరగోళంగా మారింది. సీనియర్ నాయకుల ఎదురుగానే పార్టీలో ఉన్న వారికి తగిన గుర్తింపు ఇవ్వకుండా అగౌరవ పరుస్తారా, అలాంటప్పుడు మా అవసరం ఏముంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు ఇరువర్గీయులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికీ కొంతమంది నాయకులు అలక చెంది బయటకు వెళ్లే ప్రయత్నం చేయడంతో వారిని బుజ్జగించారు. రాజీ చేసేందుకు ప్రయత్నం చేశారు.

క్లుప్తంగా

మార్గదర్శకాల ప్రకారం ఇంటి నుంచే ఓటింగ్

అమలాపురంరూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్, ఇంటి నుంచే ఓటింగ్ విధానాలను మార్గదర్శకాలు అనుగుణంగా చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తపాలా బ్యాలెట్ ఇంటి నుంచే ఓటింగ్ సన్నద్ధత చర్యలు అమలు విధానాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రిటర్నింగ్ అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్, పోలింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులు, అత్యవసర సేవలలో నిమగ్నమయ్యే సిబ్బందికి తపాలా బ్యాలెట్లు ముద్రించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఏర్పాట్లు చేపటాలన్నారు. 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్‌లు, మంచానికి పరిమితమై నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులను బీఎల్వోల సహకారంతో గుర్తించి వారికి ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. మే 12న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామగ్రిని, సిబ్బందిని సెక్టార్ అధికారి పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు. మే 13న ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని సమాయత్త పరచాలని చెప్పారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముమ్మిడివరం: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 2,100 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం పడమటపాలెంకు చెందిన మంజుల సతీష్‌కుమార్, నడకుదటి బాలకృష్ణ సోమవారం వ్యాన్‌లో అక్రమంగా డీజిల్ తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. వ్యాన్ సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్సై డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి ప్రో-కార్ రేసింగ్ సీజన్-4 పోటీలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ప్రో-కార్ రేసింగ్ సీజన్-4 పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాశాల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. సోమవారం నుంచి నాలుగు రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు చెన్నై, కర్ణాటక, తెలంగాణ, తదితర రాష్ట్రాల నుంచి 13 టీమ్‌లకుగాను 350 మంది సభ్యులు పాల్గొంటున్నట్టు తెలిపారు. వాహనాల వేగం, మోడల్, వెయిట్, బ్రేక్, ఇంజిన్ పికప్, లోడ్, తదితర అంశాలతో నిర్వహించిన ఈ పోటీలలో ప్రతి విభాగం నుంచి బహుమతులు అందజేస్తామన్నారు.

వైవిధ్య భరితం.. అరుదైన చరితం

- అమ్మవారి జాతర్లలో భిన్నమైన ఆచారాలు
- దుష్టశక్తులు రాకుండా కర్రలతో కాపలా
- దోషాలు పోవాలంటే దున్నపోతు తొక్కాల్సిందే



ఉప్పాడ శివారు కొత్తపట్నంలో నేరేళ్లమ్మవారు



అమీనాబాద్ గ్రామంలో దున్నపోతుతో తొక్కించుకుంటున్న గ్రామస్తులు (ఫైల్)



కొత్తపట్నంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు దుష్టశక్తులు రాకుండా కర్రలతో కొడుతూ కాపలా కాస్తున్న యువకులు (ఫైల్)

పిఠాపురం: అది ఉప్పాడ సాగర తీరం. సముద్ర కెరటాల హోరు నిత్యం ధ్వనిస్తుంటుంది. కాని ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో అమావాస్య, పౌర్ణమిలకు సముద్ర ఘోషను సైతం తోసిరాజని అమ్మవార్ల నామస్మరణ మారు మోగుతుంది. గ్రామ దేవతల జాతరలతో అన్ని గ్రామాలు పులకించిపోతాయి. తీర ప్రాంతంలో అమ్మవార్ల జాతరలు విభిన్న ఆచారాలతో ఆకట్టుకుంటాయి. కళకళలాడుతున్న విద్యుద్దీపాల మధ్య జనం చుట్టూ ఉండి కర్రలతో కొడుతున్న దృశ్యం చూస్తే అక్కడ ఏదో పెద్ద గొడవ జరుగుతోందని, ఎవరినో మధ్యలో పెట్టి కొడుతున్నారనే అనుమానం వస్తుంది. కాని అది ఒక ఆచారం అని తెలిసాక ఆశ్చర్యపోక తప్పదు. జనం అందరూ నేలపై పడుకుని ఉండగా ఒక దున్నపోతు వారిపై నుంచి పరుగులు తీస్తుంటే పక్కనే ఊరంతా గుమిగూడి చూస్తూ దణ్ణం పెడుతుంటే ఇదేంటి ఇంత దారుణం జరుగుతున్నా అలా చూస్తున్నారేమిటి అని పిస్తుంది కాని అదీ ఒక ఆచారమే అని తెలిసాకా ఔరా అనిపించకమానదు. మార్చి నెల రెండవ వారం నుంచి అన్ని గ్రామాలు, పట్టణాల్లో గ్రామ దేవతల సంబరాలు ప్రారంభమవుతాయి. మే నెల మొదటి వారం వరకు ఇవి కొనసాగుతాయి. విభిన్న ఆచారాల కలబోతతో కుల మతాలకు అతీతంగా ఈ ఉత్సవాలు జరుపుకుంటారు.

తీరంలో తీరే వేరు..

ఇక తీర ప్రాంత గ్రామాల్లో ఆలయాల దేవతలు చిత్ర విచిత్రంగా ఉంటారు. అక్కడ ఉండేవి ఆలయాలే కాని నిత్యధూప, దీప, నైవేద్యాలు, పూజలు ఉండవు. కానీ అమ్మవారి ప్రతిమలు ఉంటాయి. కొలిచే భక్తులు కోకొల్లలే వైవిధ్య భరితంగా కనిపించే ఆ ఆలయాల్లో మత్స్యకారులు కొలిచే దేవతలు ఉంటారు. సాధారణంగా గ్రామ దేవతల ఆలయాలలో ఎక్కువ శాతం నిత్య ధూప దీప నైవేద్యాలు ఉండక పోయినా భద్రత ఉంటుంది. ఆలయాలకు తలుపులు, ప్రహరీ గోడలు ఉంటాయి. వాటిలో విగ్రహాలకు కచ్చితమైన రూపురేఖలు ఉంటాయి కానీ ఇక్కడ అవేమీ కనిపించవు. మత్స్యకారులు మనస్సులోనే అమ్మను తలచుకుంటూ ఆమెపై భారం వేసి జీవనోపాధికి వెళుతుంటారని చెబుతున్నారు. తీర ప్రాంత గ్రామాలలో మాత్రమే కనిపించే ఈ ఆలయాలు ఎంతో విశిష్టతను కలిగి ఉంటాయి. నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంపై చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తమతమ ఇష్టదైవాలైన అమ్మవార్లకు మొక్కుకుని వేటకు వెళుతుంటారు. దానికి అనువుగా నిర్మించుకున్న ఆలయాలు చూసేవారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటాయి.

ఆద్యంతం ఆకట్టుకునేలా..

అత్యంత నియమ నిష్టలతో మత్స్యకారులు చేసే అమ్మవారి జాతరలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి.

పూర్వం నుంచీ..

ఉప్పాడ శివారు కొత్తపట్నంలో వేంచేసియున్న గ్రామ దేవత నేరేళ్లమ్మ జాతరలో అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు ఊళ్లో యువకులంతా కలిసి కర్రలతో కాపాలా కాస్తారు. నైవేద్యం సమర్పించే టప్పుడు దుష్టశక్తులు ఏవీ రాకుండా కర్రలతో కొడుతు అమ్మవారికి నైవేద్యం సమర్పించడం ఇక్కడ పూర్వ కాలం నుంచి వస్తున్న ఆచారంగా స్థానికులు చెబుతున్నారు.

సాధారణంగా మత్స్యకారులు పూజించే అమ్మవార్ల పేర్లు నేరేళ్లమ్మ, భాగిరథమ్మ, బంగారమ్మ, గంగమ్మ, కాశిమ్మ, పోలేరమ్మ, చినతల్లి, పెదతల్లి అనేటి వంటి అనేక పేర్లతో పిలుచుకుంటారు. ఇతర ప్రాంతాల్లో ముత్యాలమ్మ, నక్కుళ్లమ్మ, సత్తెమ్మ, బోడకొండమ్మ, నూకాలమ్మ, మరిడమ్మ, మావుళ్లమ్మ తదితర పేర్లతో పిలుస్తుంటారు.

దోషాలు పోతాయని

అమీనాబాద గ్రామంలో పోలేరమ్మ జాతరలో ఒక దున్న పోతును జాతరకు ముందు కొన్ని నెలల నుంచి పెంచి పోషించి ప్రత్యేక పూజల అనంతరం దానితో తొక్కించుకుంటారు. గ్రామంలో ప్రజలు స్నానాలు చేసి వరుసగా నేలపై పడుకుని ఉండగా దున్నపోతును వారిపై నుంచి నడిపిస్తారు. దున్నపోతు గిట్టలు తమ శరీరాలకు తగిలితే వారికి ఉన్న రోగాలు పోతాయని వారి ఆచారంగా స్థానికులు చెబుతారు.

ఏడాదిలో ఒకటే పండగ

సాధారణంగా గ్రామ దేవతల ఆలయాలలో ఎక్కువ శాతం వారానికి ఒక సారైనా సాధారణ పూజలు చేస్తుంటాం. కానీ గ్రామ దేవతల ఆలయాలలో దేవతలకు మాత్రం ఏడాదికి ఒకసారి అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తాం. కఠికమైన నియమనిష్టలతో ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అగ్నిగుండాలు తొక్కడం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తాం. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయాలను సుందరంగా తీర్చిదిద్ది ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తాం. మా ఆచారం ప్రకారం అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు దుష్టశక్తులు రాకుండా కాపాలా కాస్తుంటాం.

వనమాడి జగన్నాథం, కొత్తపట్నం, ఉప్పాడ

మా తాతల నాటి నుంచీ..

మా తాతల కాలం నుంచీ దున్నపోతుతో తొక్కించుకోవడం ఆచారంగా వస్తోంది. ఇది చాలా నిష్టగా చేస్తారు. మా గ్రామంలో అమ్మోరులుగా కొందరు మహిళలు ఉంటారు. వారికి దండలు వేసి అమ్మవారిగా భావిస్తారు. గ్రామస్తుల కింద పడుకుని ఉండగా వారిపై నడిపిస్తారు. వీరితో పాటు దున్నపోతును నడిపిస్తారు. ఇలా చేయడం వల్ల మా గ్రామంలో ఉన్న దోషాలు పోతాయని నమ్ముతాం.

– నక్కా మణికంఠ, సర్పంచ్ అమీనాబాద్, కొత్తపల్లి మండలం

ఉగాదికి నాటికల పోటీలు

రావులపాలెం: ఉగాదికి కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలను నిర్వహిస్తున్నట్టు కళాపరిషత్ కన్వీనర్ గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య తెలిపారు. సోమవారం స్థానిక సీఆర్‌సీ ఓల్డేజ్ హోమ్‌లో మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వారు వెల్లడించారు. నాటికల పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 24వ ఉగాది నాటికల పోటీలకు నలుగురు సీనియర్ కాటన్ కళాపరిషత్ సభ్యులు నెల రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పరిషత్‌ల నాటికలు 60 చూసి ఏడింటిని ఎంపిక చేశారన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఉగాది సందర్భంగా ఈ నాటికలను ప్రదర్శిస్తామన్నారు. తొలిరోజు రెండు నాటికలు గంగోత్రి పెదకాకాని వారి అస్తికలు, పండు క్రియేషన్స్ ఒంగోలు వారి పక్కింటి మొగుడు ప్రదర్శిస్తామన్నారు. రెండో రోజు మూడు నాటికలు కరీంనగర్ చైతన్య కళాభారతి వారి చీకటి పువ్వు, హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ వారి థింక్, హైదరాబాద్ మల్లాది క్రియేషన్స్ వారి సీకట్లో సెంద్రుడు హాస్య నాటిక ఉంటాయన్నారు. మూడో రోజు రెండు నాటికలు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం, విజయవాడ మైత్రి కళానిలయం బంధం నాటికలతోపాటు చివరి రోజు సీఆర్‌సీ వారి ప్రత్యేక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శన నాటికను కళాపరిషత్ కన్వీనర్ విక్టరీ వెంకటరెడ్డి రచన చేయగా, దర్శకత్వం గంటా రామమోహన్‌రావు వహిస్తారన్నారు. ప్రారంభం రోజున నృత్య ప్రదర్శనలు, పంచాంగ శ్రవణం, కాటన్ కళా పురస్కారం ప్రదానం ఉంటుందన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పరిషత్ కన్వీనర్ వెంకటరెడ్డి, అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ అశోక్‌రెడ్డి తదితరులు

పోటీల ప్రారంభానికి సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, డైరెక్టర్లు వంశీ, అజయ్ భూపతి, దండు కార్తీక్, గౌతంరాజు, కోట శంకరరావు, సారిక రామ చంద్రరావు హాజరవుతారన్నారు. సమావేశంలో సీఆర్‌సీ సెక్రటరీ కర్రి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నం తేజారెడ్డి, నాటక కళా పరిషత్ డైరెక్టర్ కె.సూర్య, స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, పీఎస్ఎన్‌రెడ్డి, పలివెల త్రిమూర్తులు పాల్గొన్నారు.

హత్య కేసులో భర్తకు రెండేళ్ల జైలు

రాయవరం: భార్యను శారీరకంగా మానసికంగా వేధింపులకు గురిచేసి ఆమె హత్యకు కారణమైన భర్తకు రామచంద్రపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సోమవారం జైలు శిక్ష విధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాయవరం ఎస్సై జి.నరేష్ విలేకరులకు తెలిపారు. రాయవరం మఠం వీధికి చెందిన పిచ్చుక బుల్లియ్యకు కడియం మండలం దుళ్ళకు చెందిన జక్కం వీర వెంకట సత్యనారాయణ కుమార్తె దేవిని ఇచ్చి వివాహం చేశారు. వివాహం అనంతరం కొంతకాలం వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం దురలవాట్లకు అలవాటు పడిన బుల్లియ్య దేవిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసేవాడు. వేధింపులకు తట్టుకోలేక దేవి 2015 సెప్టెంబర్ 24న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై అప్పటి ఎస్సై చావా సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహించారు. కేసు వాదోపవాదాల అనంతరం భార్య దేవిని బుల్లియ్య శారీరక, మానసిక వేధింపులకు గురి చేసినట్టు నిర్ధారించి జడ్జి కె.వెంకటేశ్వరరావు రెండు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎంవీవీ ప్రకాశరావు వాదనలు వినిపించారు. ఎస్సై నరేష్, హెచ్‌సీ కేవీ రాఘవులు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.

నిచ్చెన లేక మృత్యు కుహరానికి..

- వెల్డింగ్ చేస్తుండగా పేలిన ట్యాంకర్
- ఇద్దరి మృతి, ఒకరికి గాయాలు
- కత్తిపూడిలో విషాదం



కొంజర్ల ప్రభాకర్



బూరా సోమరాజు



పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుల బంధువులు, స్నేహితులు

పిఠాపురం: చిన్న నిచ్చెన పెద్ద ప్రమాదానికి కారణమయ్యింది. ఆ నిచ్చెన లేక పైకి ఎక్కి మూతలు తీయడం కుదరక చిన్న పనే కదా అనుకుని ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా తొందరపడి వెల్డింగ్ చేయడంతో పెద్ద ప్రమాదం ఏర్పడి రెండు కుటుంబాలను దిక్కు లేని వారిని చేసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండల శివారు ప్రాంతంలో ఒక ఆయిల్ ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా అది పేలిపోవడంతో ఇద్దరు మృతి చెందగా ఒకరికి గాయాలయిన ఘటన మృతుల స్వగ్రామం కత్తిపూడిలో విషాదాన్ని నింపింది. కత్తిపూడికి చెందిన గాబు గంగాధర్ తన అయిల్ ట్యాంకర్‌కు మరమ్మతులు చేసేందుకు కత్తిపూడికి చెందిన లారీ డ్రైవరు బూరా సోమరాజు అలియాస్ శ్యామ్యూల్ (45)ను వెల్డింగ్ మేస్త్రీ కత్తిపూడికి చెందిన కొచ్చెర్ల ప్రభాకర్ వద్దకు పంపించాడు. వారు గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారు తొండంగి మండలం రావికంపాడు సమీపంలో ఏలేరు కాలువ వద్ద ఉన్న వెల్డింగ్ షాపునకు వెళ్లారు. కొచ్చెర్ల ప్రభాకర్ వెల్డింగ్ చేస్తున్నాడు. పనిని లారీ డ్రైవరు బూరా సోమరాజు దగ్గర ఉండి చూస్తున్నాడు. ఇంతలో ఆయిల్ ట్యాంకు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోవడంతో దగ్గరగా ఉన్న లారీ డ్రైవరు బూరా సోమరాజు, వెల్డింగ్ మేస్త్రీ కొచ్చెర్ల ప్రభాకర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వెల్డింగ్ షాపు ఓనరు నున్న లోవరాజుకు గాయాలు అయ్యాయి. గాయాలైన లోవరాజును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో పేలి పోయిన ఆయిల్ ట్యాంకర్

నిచ్చెనే ప్రాణాలను తీసింది

ట్యాంకర్‌కు ఉన్న మూతలు తీయకుండా వెల్డింగ్ చేయడం వల్ల ట్యాంకు లోపల వేడి గాలి పెరిగి పేలుడు సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు. సాధారణంగా ఆయిల్ ట్యాంకర్లకు పైన మూతలు ఉంటాయి. వాటిని ఎప్పుడూ మూసే ఉంచుతారు. ప్రస్తుతం ప్రమాదానికి గురైన ట్యాంకర్‌కు మూతలు వేసే ఉన్నాయి. ట్యాంకర్ వెనుక భాగంలో ఉండే నిచ్చెన ఊడి పోవడంతో అలా ఉండగా వెల్డింగ్‌కు తీసుకువచ్చిన డ్రైవరు మూతలు తీసి చేయిద్దామనుకుంటే పైకి ఎక్కి మూతలు తీయడానికి నిచ్చెన లేక వేరే విధంగా ఎక్కడానికి వీలు కుదరక చిన్న పనే కదా, అవసరం ఉండదని భావించి మూతలు తీయకుండానే వెల్డింగ్ చేయడం ప్రారంభించారు. అంతే వెల్డింగ్ మొదలు పెట్టిన నిమిషాల్లోనే పేలుడు సంభవించింది. ట్యాంకర్ ముక్కలు ముక్కలుగా విడిపోయి వెనుక వెల్డింగ్ పనిలో ఉన్న లారీ డ్రైవరు బూరా సోమరాజు, వెల్డింగ్ మేస్త్రీ కొంజర్ల ప్రభాకర్‌ల పైకి దూసుకువచ్చి బలంగా ఢీకొట్టడంతో వెనుకకు ఎగిరిపడిన ఇద్దరు వెనుక ఉన్న ఇనుప చట్రాలపై పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను మంచినీటి సరఫరాకు వినియోగిస్తున్నారు. వాటర్ ట్యాంకు కావడం వల్ల పేలుడు ప్రభావం తక్కువగా ఉందని అదే ఆయిల్ ట్యాంకర్ అయితే లోపల ఉన్న కొద్ది పాటి ఆయిల్‌తో పేలుడు ధాటికి మంటలు కూడా వ్యాపించి పెద్ద విస్ఫోటం సంభవించేదని పోలీసులు చెబుతున్నారు.

పెద్ద దిక్కును కోల్పోయిన రెండు కుటుంబాలు

మృతుడు సోమరాజు 20 ఏళ్లుగా లారీ డ్రైవరుగా పని చేస్తున్నాడు. అతనికి భార్య ప్రియాంక, కుమారుడు వరుణ్, కుమార్తె సమీరా ఉన్నారు. లారీ డ్రైవరుగా ఉద్యోగం చేస్తూ సంపాదించిన దానిపైనే కుటుంబం నడుస్తోందని ఇక జీతం డబ్బులు తెచ్చి మమ్మల్ని పోషించేదెవరంటూ మృతుడి సోమరాజు భార్యపిల్లలు రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. మరో మృతుడు కొంజర్ల ప్రభాకర్‌కు భార్య చిన్నారి, కుమారులు త్రినాథ్, చందు, కుమార్తె తేజస్విని ఉన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం వారిది. కుటుంబం అంతా ప్రభాకర్‌పైనే ఆధారపడి ఉంది. ప్రమాదంలో ప్రభాకర్ చనిపోయాడని తెలిసి ఇక మాకు దిక్కెవరంటూ అతని భార్య పిల్లలు గుండెలవిసేలా రోదిస్తుంటే ఆపడం ఎవరితరం కాలేదు.

రాము కార్టూన్‌కి జ్యూరీ అవార్డు

అమలాపురం రూరల్: నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూన్ ఫోరమ్, విశాఖపట్నం ఆధ్వర్యంలో హాస్యానందం మాసపత్రిక సౌజన్యంతో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మాడా రాము కార్టూన్‌కు ప్రత్యేక జ్యూరీ బహుమతి లభించింది. తల్లిదండ్రుల డబ్బుతో విదేశాల్లో స్థిరపడిన పిల్లలు వారి బాగోగులు చూడకపోవడంతో, జీవచ్ఛవాలుగా మారిన దుస్థితిని వివరిస్తూ గీసిన చిత్రానికి జ్యూరీ అవార్డు ప్రకటించారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 72 మంది తెలుగు కార్టూనిస్టులు 194 ఎంట్రీలను పంపగా 25 ఉత్తమ కార్టూన్లు ఎంపిక చేశారని రాము తెలిపారు. బహుమతి ప్రదాన సభ 14వ తేదీన విజయవాడలో నిర్వహిస్తారని కార్టూనిస్ట్ రాము కి సమాచారం అందింది.



అవార్డు సాధించిన కార్టూన్ (అంతరచిత్రం) మాడా రాము

కాలువలో పడి కూలీ మృతి

కడియం: మండలంలో కడియపులంక వద్ద కోటిపల్లి కాలువలో పడి దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాయపురెడ్డి అయ్యప్ప (45) అనే వ్యవసాయ కూలీ మృతి చెందాడు. సోమవారం కడియపులంక వచ్చిన అయ్యప్ప పని ముగించుకుని స్నానానికి పూలమార్కెట్ సమీపంలోనే కాలువ రేవు వద్దకు వచ్చాడు. అక్కడ స్నానానికి దిగుతుండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయాడని స్థానికులు చెబుతున్నారు. కాసేపటికి అతడు మృతిచెందాడని వివరించారు. ఈ మేరకు కడియం పోలీస్‌లకు తెలియజేశారు.